సాక్షి నంద్యాల

శనివారం । 14 । డిసెంబర్ । 2024



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో ఉత్సవమూర్తులను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



నందీశ్వరస్వామికి పరోక్షసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు శుక్రవారం శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. 23 మంది భక్తులు పరోక్షసేవగా పూజలు జరిపించుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,629.25
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 91.202
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,909
అవుట్ ఫ్లో	: 5,832

న్యూస్‌రీల్

863.80 అడుగులుగా డ్యాం నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల డ్యాం నీటిమట్టం శుక్రవారం సాయంత్రం సమయానికి 863.80 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 118.3380 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గురువారం నుంచి శుక్రవారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లైన నాగార్జునసాగర్, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ, కల్వకుర్తి ఎత్తిపోతల, హంద్రీనీవా సుజల స్రవంతికి 13,021 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు కేంద్రంలో 3.527 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. పంప్ మోడ్ ఆపరేషన్ ద్వారా 7,594 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి మళ్లించారు.

శాస్త్రోక్తంగా తిరునక్షత్ర మహోత్సవం



ఉత్సవమూర్తులకు తిరుమంజనం దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో తిరునక్షత్ర మహోత్సవ పూజలు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున మూల మూర్తులను సుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్యపూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి తిరుమజనం నిర్వహించారు. ధూపదీపాలతో మహా మంగళహారతి ఇచ్చారు.

నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

నంద్యాల(రూరల్): జిల్లాలో సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరుగనున్నాయి. కేసీ కెనాల్ పరిధిలోని 1,62,854 ఎకరాల ఆయకట్టు కింద 52 డబ్ల్యూఏ, 9 డీసీ, 1 పీసీ, ఎస్సార్బీసీ పరిధిలో 1,53,034 ఎకరాల ఆయకట్టు కింద 50 డబ్ల్యూఏ, 8 డీసీ, 1 పీసీ, తెలుగుగంగ పరిధిలో 1,29,412 ఎకరాల ఆయకట్టు కింద 47డబ్ల్యూఏ, 8 డీసీ, 1 పీసీ, శివభాష్యం పరిధిలో 12,092 ఎకరాల ఆయకట్టు కింద 7 డబ్ల్యూఏ, 1 పీసీ, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 40,056 ఆయకట్టు కింద 104 డబ్ల్యూఏ, మైలవరం పరిధిలో 740 ఎకరాల ఆయకట్టు కింద 01 డబ్ల్యూఏ ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,98, 190 ఎకరాల ఆయకట్టు కింద 261డబ్ల్యూఏ, 25డీసీ, 4 పీసీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 3 లక్షలకు పైగా రైతులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఈనెల 17న డీసీ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కర్నూలు (లీగల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు అందరూ ఉపయోగించుకోవాలని, తమ కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు.

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో శుక్రవారం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు.

నేడు శ్రీశైలగిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఈఓ విలేకరులతో మాట్లాడుతూ నేటి సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

కూటమి ప్రభుత్వంపై కర్షకులు కన్నెర్రజేశారు. నమ్మించి మోసం చేసిందని నినదించారు. బాబూ.. ఎన్నికల హామీల అమలు ఇంకెప్పుడు అని నిలదీశారు. 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' చేపట్టిన పోరుబాటలో కదం తొక్కారు. దగా చేస్తున్న ప్రభుత్వంపై నిరసన గళం హోరెత్తించారు. శుక్రవారం నూనెపల్లె నుంచి కలెక్టరేట్ వరకు సాగిన ర్యాలీలో వేలాది మంది రైతన్నలు పాల్గొని విజయవంతం చేశారు. – నంద్యాల

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు



దగా పాలనపై కన్నెర్ర

- అన్నదాతకు అండగా కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ
- నిరసన ర్యాలీకి భారీగా తరలివచ్చిన రైతులు
- ప్రభుత్వ మోసపూరిత వైఖరిని ఎండగట్టిన పార్టీ నేతలు
- అన్నదాత సుఖీభవ, ఉచిత పంటల బీమా, గిట్టుబాటు ధర ఏదని నిలదీత
- ఆరునెలల్లో వందల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన
- స్పందించి ఆదుకోకపోతే సర్కారుకు గుణపాఠం తప్పదని హెచ్చరిక
- కలెక్టరేట్‌లో జేసీ విష్ణుచరణ్‌కు రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేత



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, నేతలు శిల్పాచక్రపాణిరెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, బిజేంద్రారెడ్డి, కాటసాని రామిరెడ్డి, శిల్పా రవి, ధార సుధీర్ తదితరులు

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాటకు కర్షకులు కదలివచ్చారు. జిల్లాలోని పాణ్యం, డోన్, ఆళ్లగడ్డ, నంద్యాల, బనగానపల్లె, నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల నుంచి శుక్రవారం ఉదయం భారీగా జిల్లా కేంద్రం నంద్యాలకు తరలివచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కూటమి సర్కారు పాలనను నిరసిస్తూ నూనెపల్లెలోని ఉదయానంద రెసిడెన్సి నుంచి కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఇందులో మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, గంగుల బిజేంద్రా రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సుధీర్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తర్వాత వారు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌ను కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నష్టపోయిన రైతులకు అండగా నిలవాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని చెప్పారు. నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలు లేకుండా రైతులకు పన్ను రసీదులు అధికారులు ఇవ్వడం లేదని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిలో ఒకటి కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు. రైతులను చంద్రబాబు మరోసారి దగా చేశారని, పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని, ఇప్పటి వరకు పైసా ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని.. వారికి వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్లు ఆనందంగా ఉన్న రైతన్నలు కూటమి పాలనలో కన్నీళ్లు పెడుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలవుతున్నా చంద్రబాబు కనీసం రైతులకు పంట పెట్టుబడి సాయం కూడా చేయలేదన్నారు. దీంతో చాలా మంది రైతులు అప్పుల పాలయ్యారన్నారు. వీరిలో కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఆరునెలల కాలంలోనే రాష్ట్రంలో వందల మంది ప్రాణాలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులు చూడలేక తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సర్కారుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట చేపట్టిందన్నారు. మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు పంట నష్టం సంభవిస్తే వెంటనే పరిహారం లభించేదన్నారు. కష్టాల్లో కర్షకులను ఆదుకునేందుకు ఉచిత పంట బీమా అమలు చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని ఎసరుపెట్టి బీమా భారం రైతులపైనే వేసిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేలు ఇస్తామని కూటమి నాయకులు ప్రకటించి దగా చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి సద్దల సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల భరత్‌కుమార్‌రెడ్డి, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్‌నాయుడు, నాయకులు కల్లూరి రామలింగారెడ్డి, దాల్‌మిల్ అమీర్‌బాషా, కాటసాని తిరుపాల్‌రెడ్డి, శిల్పా భువనేశ్వరరెడ్డి, శశికళ రెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి, గ్రామ, మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అన్నదాతకు అండగా ర్యాలీ చేపట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ర్యాలీకి భారీగా తరలివచ్చిన రైతన్నలు

కష్టాల్లో నెట్టిన కూటమి సర్కారు

ఎన్నికల్లో చంద్రబాబు పంటపెట్టుబడిసాయం పెంపుతో పాటు అనేక హామీలు ఇచ్చారు. అందులో ఇప్పటి వరకు ఒక్కటి కూడా అమలు చేయలేదు. మా ప్రభుత్వ హయాంలో రైతులకు ఏటా రైతు భరోసా కింద రూ. 13,500 సాయం అందేది. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేది. ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేసేది. దీంతో పాటు ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తూ రబీ, ఖరీఫ్ సమయాల్లో రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. కూటమి సర్కారు తోడుగా నిలబడకపోగా కష్టాల్లోకి నెట్టింది.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

ఆర్బీకేలు నిర్వీర్యమయ్యాయి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఆర్బీకే కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేయడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– పోచాబ్రహ్మానందరెడ్డి, మాజీ ఎంపీ

ఉచిత పంటల బీమాకు ఎసరు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏడాదికి రూ. 1,200 కోట్లతో ఉచిత పంటల బీమా పథకం అమలు చేసింది. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఎసరు పెట్టి రైతులకు బీమా లేకుండా చేసింది. అలాగే నాడు వివిధ రకాల విత్తనాలపై 40శాతం సబ్సిడీ ఉండగా దీనిని కూడా బాబు కోతపెట్టారు.

–గంగుల ప్రభాకర్‌రెడ్డి , మాజీ ఎమ్మెల్సీ

బాబువి అన్నీ మాయమాటలే

చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు అన్ని మాయమాటలు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానని, రైతులకు 20వేల ఆర్థిక సహాయం అందిస్తానని నమ్మించి అధికారంలోకి వచ్చాక మోసం చేశాడు.

– శిల్పాచక్రపాణిరెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే

ఆదుకుంటామని నమ్మించి..

కూటమి నాయకులు ఎన్నికల ముందు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని నమ్మించారు. ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదు. అన్నదాత సుఖీభవ లేదు..గిట్టుబాటు ధర లేదు.. పంట నష్ట పరిహారమూ లేదు.

–కాటసాని రామిరెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే

ధాన్యానికి మద్దతు ధర ఏదీ?

కష్టపడి రైతులు పండించిన వరి ధాన్యానికి కనీస మద్దతు ధర లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో దళారులు తక్కువ ధరకు ధాన్యం అడుగుతుండటంతో పెట్టిన పెట్టుబడులు రావడం లేదు.

– శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పంట చేతికి వచ్చే దశలో వానలు పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారిని పరిహారం అందించి ఆదుకోవాలి. లేకపోతే రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు మరింత తీవ్రతరం చేస్తాం.

– గంగుల బిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే

అన్నదాతను నట్టేట ముంచారు

పంటలకు గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయకుండా కూటమి పాలకులు రైతులను నట్టేట ముంచారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం రైతులపై ఎనలేని ప్రేమ ఉన్నట్లు నటించారు. ఇప్పుడు వారిని కష్టాల్లోకి నెట్టేశారు.

– ధార సుధీర్, వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు ఇన్‌చార్జ్

మహానందీశ్వరుడి ఆదాయం రూ.59.49 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం


మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తులు మహానందీశ్వరుడికి సమర్పించిన కానుకల ద్వారా రూ.59,49,355 ఆదాయం లభించినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహానందిలోని సామూహిక అభిషేక మండపంలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారితోపాటు కోదండరామాలయం, వినాయకనంది, ఆంజనేయస్వామి, తదితర ఆలయాల ద్వారా రూ.57,94,430, అన్నప్రసాదం విభాగం ద్వారా రూ.1,26,829, గోసంరక్షణ ద్వారా రూ.28,096 వచ్చిందన్నారు. హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పల్లకీలో మహానందీశుడి దంపతుల విహారం

మహానందీశుడి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు ముందుగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, హారతులు నిర్వహించారు. తర్వాత ఆలయ ప్రాకారాల్లో నిర్వహించిన పల్లకీసేవలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ అవర్స్ నిర్వహించకపోవడంపై డీఈఓ సీరియస్

- ఏఎన్‌ఆర్ జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎంకు మెమో జారీ



ఏఎన్‌ఆర్ జెడ్పీ హైస్కూలులో స్టడీ అవర్ నిర్వహిస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

పాములపాడు: మండలకేంద్రం పాములపాడులోని ఏఎన్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్టడీ అవర్ నిర్వహించకపోవడంపై డీఈఓ జనార్దన్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఉదయం 8.20 గంటల సమయంలో ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఉపాధ్యాయులెవ్వరు లేకపోవడంతో ఆయన స్వయంగా స్టడీ అవర్ నిర్వహించారు. తర్వాత హెచ్‌ఎం గోపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమో జారీ చేశారు. అలాగే సమయపాలన పాటించని ఉపాధ్యాయులను వివరణ కోరారు. పూర్తైన పాఠ్యాంశాలు, విద్యార్థుల హాజరు తదితర విషయాలపై ఆరా తీశారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గితే సహించేది లేదని హెచ్చరించారు. వేళకు రాకపోతే ఎలా అని ఉపాధ్యాయులపై మండిపడ్డారు. అనంతరం ఏపీ మోడల్‌స్కూలు, కేజీబీవీ పాఠశాలలను తనిఖీ చేసి తరగతి గదులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓలు బాలాజీనాయక్, సుభాషిణి దేవి, సీసీ రామకృష్ణ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రేపటి వరకే పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువు

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం చెల్లింపు శనగ, జొన్న, వేరుశనగ, ఉల్లి, టమాట పంటలకు ఈ నెల 15 వరకే గడువు ఉంది. రైతులతో ప్రీమియం కట్టించాలని జిల్లా యంత్రాంగం ఏవోలు, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలపై ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు అన్ని పంటలకు కలిపి 22,943 మంది రైతులు ప్రీమియం చెల్లించినట్లు తెలుస్తోంది. శనగకు 14,801 మంది, వేరుశనగకు 1,923, ఉల్లికి 418, వరికి 219, జొన్నకు 5,396, టమాటకు 186 మంది ప్రకారం రైతులు ప్రీమియం చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. రైతులు ప్రీమియం కింద రూ.1,93,26,555 చెల్లించినట్లు సమాచారం. వరికి ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 31 వరకు అవకాశముండగా..మిగిలిన పంటలకు ఆదివారంతో ప్రీమియం చెల్లింపు గడువు పూర్తవుతోంది.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మే/జూన్ నెలల్లో జరిగిన డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు ఫలితాలను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు పంపడం జరిగిందని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు 120 మంది హాజరు కాగా 63 మంది, రెండో సంవత్సరం పరీక్షలకు 264 మంది హాజరు కాగా 122 మంది, మూడవ సంవత్సరం పరీక్షలకు 519 మంది హాజరు కాగా 249 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

మద్దతు ధరతో బియ్యం కొనుగోలు చేయండి

నంద్యాల: రైతులు నష్టపోకుండా మద్దతు ధరతో బియ్యం కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ రైస్ మిల్లర్లు, ట్రేడర్లకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బియ్యం కొనుగోలు అంశంపై రైస్ మిల్లర్లు, ట్రేడర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో వరి పంట దిగుబడి అధికంగా వచ్చిందన్నారు. ఇక్కడి బియ్యానికి మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా మంచి డిమాండ్ ఉందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుత సీజన్‌లో పంట దిగుబడి అధికంగా రావడంతో కొంతమేర ధరలు తగ్గాయన్నారు. కొన్నిచోట్ల బియ్యంలో తేమశాతం సాకుగా చూపి మిల్లర్లు, ట్రేడర్లు మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ధాన్యంలో తేమ శాతాన్ని సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో పరీక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకట్రాముడు, డీఎం సివిల్ సప్లయ్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి జర్నలిస్టులపై దాడి హేయం

- దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- జర్నలిస్ట్ సంఘాల నాయకులు డిమాండ్



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయులు

నంద్యాల: పులివెందుల నియోజకవర్గం వేముల మండల కేంద్రంలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజీకి వెళ్లిన సాక్షి టీవీ రిపోర్టర్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక విలేకరి రాజారెడ్డిపై దాడి హేయమైన చర్య అని జర్నలిస్టు సంఘాలు పేర్కొన్నాయి. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై కూటమి నాయకులు దాడి చేయడం బాధాకరమని, రాజకీయంగా కక్షలు ఉంటే రాజకీయంగానే చూసుకోవాలని సూచించాయి. సాక్షి జర్నలిస్టులపై దాడిని నిరసిస్తూ శుక్రవారం జర్నలిస్ట్ సంఘాల నాయకులు, పాత్రికేయులు జిల్లాలో నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమాలు చేపట్టారు. నంద్యాలలో జరిగిన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు చల్లా మధు, వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ట్రెజరర్ వై.జాషువా, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని, జర్నలిస్టులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో జర్నలిస్ట్‌లపై దాడులు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న పార్టీలకు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శరత్, నాగప్రసాద్, బాషా, రాజేష్, నిరంజన్, విజయ్, బాలునాయక్, మౌలాలి, కుమార్, పవన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుట్టలపల్లి ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

ప్యాపిలి: మండల పరిధిలోని గుట్టలపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటరమణకు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఎంఈఓ వెంకటేశ్ నాయక్ శుక్రవారం తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు సక్రమంగా హాజరు కావడం లేదని గ్రామస్తులు ఆందోళన చేసినట్లు పత్రికల్లో వచ్చిన కథనాలకు డీఈఓ స్పందించినట్లు ఎంఈఓ తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడానికి కారణాలను మూడో రోజుల్లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు.

తహసీల్దార్ జీతం జప్తునకు కోర్టు ఉత్తర్వులు

కర్నూలు: కోర్టు ఉత్తర్వులు అమలుపరచని కృష్ణగిరి తహసీల్దార్ జీతం జప్తునకు కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.మల్లేశ్వరి ఆదేశాలు జారీ చేశారు. కర్నూలుకు చెందిన ఎం.తిరుపతయ్య నుంచి వీఆర్వో ఎం.పెద్ద మద్దిలేటి అప్పు తీసుకుని బాకీ పడ్డాడు. ఆ అప్పు చెల్లించేందుకు వీఆర్వో జీతం జప్తు చేయాలని 2020లో కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఉత్తర్వులు అమలు చేయకుండా కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘనకు పాల్పడిన తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసును జారీ చేసింది. అప్పటికీ స్పందన లేకపోవడంతో తహసీల్దార్ జీతాన్ని జప్తు చేయాలని ఆదేశిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఆరెంజ్ బస్సుకు రూ.4.43 లక్షల జరిమానా



బస్సుకు జరిమానా విధిస్తున్న ఆర్‌టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్: రోడ్ ట్యాక్స్ కట్టని ఆరెంజ్ బస్సుకు ఆర్టీఓ అధికారులు రూ.4.43 లక్షల జరిమానా విధించారు. ఆర్‌టీఓ క్రాంతికుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఖమ్మం నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు రికార్డులు తనిఖీ చేయగా రోడ్ ట్యాక్స్ చెల్లించకుండా తిప్పుతున్నట్లు గుర్తించి రూ.4,43,000 జరిమానా విధించారు. అనంతరం బస్సును ఆర్‌టీసీ డిపోకు తరలించారు. పర్మిట్, అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు రూ.82 వేల జరిమానా విధించారు.

మల్లన్నసేవలో ఐఏఎస్ అధికారి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను కేంద్ర ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ (ఐఏఎస్ అధికారి) సంజయ్‌కుమార్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శుక్రవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఐఏఎస్ అధికారికి ఆలయ రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో ఐఏఎస్ అధికారికి వేదపండితులు వేదమంత్రాలు పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

బిల్లు రాక.. మెనూ లేక!

- వసతి గృహాలకు విడుదలకాని మెస్ చార్జీలు
- జిల్లాలో 137 సంక్షేమ వసతి గృహాలు
- 23,563 మంది విద్యార్థులకు వసతి
- బీసీ గృహాల్లో 8 నెలలు, ఎస్సీ గృహాలకు 5 నెలలుగా బకాయిలు పెండింగ్
- పెరిగిన ధరలతో బెంబేలెత్తుతున్న వార్డెన్లు
- అప్పులు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్న వైనం



దేవనగర్ ఎస్సీ హాస్టల్‌లో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

నంద్యాల(అర్బన్): ఓవైపు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు.. మరో వైపు పెరగని మెస్ చార్జీలు.. దీనికి తోడు నెలల తరబడి మెస్ చార్జీలు చెల్లించని ప్రభుత్వం... ఫలితంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల వార్డెన్లు అప్పు చేసి విద్యార్థులకు పప్పు కూడు పెట్టాల్సి వస్తోంది. కిరాణం షాపులు, చికెన్ దుకాణాలు, కూరగాయల వ్యాపారులు, గుడ్ల వర్తకులకు సకాలంలో డబ్బులు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. ఐదు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 50 మంది విద్యార్థులు ఉన్న వసతి గృహానికి నెలకు కనీసం రూ.60 వేలు ఖర్చవుతుంది. అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే ఖర్చులు మరింతగా ఉంటాయి. బొమ్మలసత్రం వద్ద ఉన్న బాలికల సమీకృత సంక్షేమ వసతి గృహంలో దాదాపు 400 మంది బాలికలు ఉన్నారు. ఇక్కడ మెస్ చార్జీలు రూ.లక్షల్లో పెండింగ్ ఉన్నాయి. కొన్ని హాస్టళ్లకు జూన్ నుంచి బిల్లులు చెల్లించాల్సి ఉంది. మరికొన్నింటికి ఏప్రిల్ బకాయిలు కూడా అందాల్సి ఉందని జిల్లా సంక్షేమాధికారులు చెబుతున్నారు. ఇలా అయితే వసతి గృహాల నిర్వహణ కష్టమని వార్డెన్లు వాపోతున్నారు. బిల్లులు చెల్లించకపోగా మెనూ మాత్రం తప్పకుండా అమలు చేయాలని ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేస్తుండటం గమనార్హం.

పెరిగిన ధరలతో బెంబేలు

నెలల తరబడి బిల్లులు రాక ఒక వైపు వార్డెన్లు అప్పులు పాలు చేస్తుంటే పెరిగిన ధరలకు మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థికి వారానికి 6 రోజులు కోడి గుడ్డు ఇవ్వాలి. ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లిస్తుంది. మార్కెట్లో గుడ్డు ధర రూ.7 పైగా ఉంది. చికెన్ ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో వారానికి మూడు సార్లు, పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో వారానికి రెండు సార్లు ఇస్తున్నారు. ప్రభుత్వం కేజీ చికెన్‌కు రూ.100 చెల్లిస్తుంది. బహిరంగ మార్కెట్లో రూ.150 నుంచి రూ.200 పైబడి ఉంటుంది. అలాగే కందిపప్పు ఒక్కో విద్యార్థికి 20 గ్రాములు ఇవ్వాలి. ప్రస్తుత ధర రూ.180 ఉంది. ఆదివారం పూరి, మంగళవారం, శనివారం ఇడ్లీ పెట్టాలి. మినపగుళ్లు, ఆయిల్ రేట్లు కూటమి ప్రభుత్వం వచ్చాక భారీగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో నెలవారీ బిల్లులు వచ్చినా వార్డెన్లకు చేతిచమురు వదలక తప్పదు. అలాంటిది నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు.

పెరగని మెస్‌చార్జీలు

పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని విద్యార్థి సంఘాలు, వార్డెన్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 2023లో అప్పటి ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచింది. ప్రస్తుతం ఇవే అమలు అవుతున్నాయి. 3, 4 తరగతుల విద్యార్థులకు నెలకు రూ.1,250, ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు నెలకు రూ.1,400 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇంటర్, ఆపైన తరగతుల విద్యార్థులకు నెలకు రూ.1,600 చెల్లిస్తుంది.

నంద్యాల జిల్లాలో హాస్టళ్ల వివరాలు

హాస్టళ్లు	హాస్టళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ఎస్సీ వెల్ఫేర్	38	4,425
బీసీ వెల్ఫేర్	33	4,220
ఎస్టీ వెల్ఫేర్	13	1,900
కేజీబీవీ	27	7,110
గురుకులాలు	7	4,010
మోడల్ స్కూళ్లు	19	1,900
మొత్తం	137	23,565



భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

నివేదికలు పంపించాం



ఐదు నెలలుగా బిల్లులు రావాల్సి ఉంది. నెలవారీగా చెల్లించాల్సిన బిల్లుల వివరాలు ప్రభుత్వానికి పంపించాం. వస్తాయనే అనుకుంటున్నాం. త్వరలో వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ విషయం వార్డెన్లకు తెలియజేశాం. బిల్లులు వచ్చిన వెంటనే వార్డెన్ల ఖాతాల్లో జమచేస్తాం.

– చింతామణి, సాంఘిక సంక్షేమం సాధికారత అధికారి, నంద్యాల

హాస్టళ్ల డైట్ చార్జీలు పెంచాలి



సంక్షేమ వసతి గృహాల డైట్ చార్జీలు పెంచాలి. ఆరు నెలలకు, ఏడాదికి ఒక సారి డైట్ చార్జీలు విడుదలవుతుండటంతో వసతి గృహాల వార్డెన్‌లు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. బిల్లులు రాకపోయినా, నిత్యావసర సరుకుల ధరలు పెరిగినా చేతి నుంచి ఖర్చు చేసి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నాం. మా ఇబ్బందులను ప్రభుత్వం గమనించాలి. అప్పుల వాళ్లు మాపై దాడులకు దిగకముందే బిల్లులు మంజూరు చేస్తే వారికి చెల్లిస్తాం.

– అద్దంకి నాగేంద్ర, వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, జూనియర్ కళాశాల బీసీ బాలుర వసతి గృహం వార్డెన్, బనగానపల్లె

ఈ చార్జీలు అప్పటి ధరలు బట్టి నిర్ధారణ చేశారని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మార్పు చేయాలని వారు కోరుతున్నారు.

చదరంగంతో మానసిక వికాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): చదరంగంతో మానసిక వికాసం కలుగుతుందని సినీ నటుడు సాయికిరణ్ అన్నారు. శుక్రవారం వివేకానంద ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ ముగింపు పోటీల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ క్రమశిక్షణతో నిరంతర సాధన చేస్తే చదరంగంలో రాణించవచ్చన్నారు. 18 ఏళ్ల వయస్సులోనే దొమ్మరాజు గుకేష్ ప్రపంచ చాంపియన్‌గా భారతదేశం గర్వించే స్థాయిలో విజయం సాధించాడన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి రమేష్, చెస్ అసోసియేషన్ నాయకులు రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

బాలికల విభాగంలో..
అన్విత(కర్నూలు), పాణ్య శ్రీవల్లి(ప్రకాశం), హారిక చౌదరి (అనంతపురం), అక్షయ, గీతామాధురి (కృష్ణా)

బాలుర విభాగంలో..
సార్య ఆరియన్(కడప), కార్తికేయకృష్ణ(కృష్ణ), అర్జిత్ (నంద్యాల), భార్గవ శ్రీనివాసనాయక్(పల్నాడు)

కౌశల్ రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి గుణదీప్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కోడుమూరు రూరల్: గూడూరు మండలం జూలకల్లు మోడల్ స్కూల్ 10వ రగతి విద్యార్థి గుణదీప్ సాయి..శల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దిల్షాద్ తెలిపారు. శుక్రవారం విద్యార్థి గుణదీప్ సాయిని ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపాల్ అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల ఏపీ భారతీయ విజ్ఞాన మండలి నిర్వహించిన కౌశల్ జిల్లా స్థాయి ప్రతిభ పరీక్షల్లో విద్యార్థి గుణదీప్ సాయి అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

బీబీఏ విద్యార్థి ఆత్మహత్య



మృతి చెందిన శ్రీహర్ష

కొలిమిగుండ్ల: బీబీఏ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మద్దిరెడ్డి జనార్దన్, దేవి దంపతుల పెద్ద కుమారుడు శ్రీహర్ష(20) గుజరాత్‌లోని వడోదరలో బీబీఏ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. తండ్రి స్థానికంగా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో పని చేస్తుండగా తల్లి మీర్జాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తోంది. శ్రీహర్ష చదివే కళాశాలలోనే ఓ విద్యార్థినితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కాగా కొద్ది రోజుల తర్వాత శ్రీహర్షను అమ్మాయి పట్టించుకోకపోవడం మనోవేదనకు గురయ్యాడు. దీంతో పది రోజుల క్రితం తల్లిదండ్రులు వడోదరకు వెళ్లి కుమారుడిని ఇంటికి తీసుకొచ్చి ప్రొద్దుటూరులోని సైక్రియాటిస్ట్ వద్ద వైద్యం చేయిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం తల్లి పాఠశాలకు, తండ్రి గ్యాస్ కార్యాలయానికి వెళ్లిన తర్వాత ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చిన తండ్రి తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లితండ్రులు బోరున విలపించారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

పంట కోత యంత్రం బోల్తా పడి మహిళ మృతి



మృతి చెందిన సుబ్బమ్మ

ఆళ్లగడ్డ: పంట కోత యంత్రం బోల్తా పడి మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు మహిళలు గాయపడిన ఘటన శుక్రవారం చిన్నకందుకూరు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. చిన్నకందుకూరు గ్రామానికి చెందిన సుబ్బమ్మ (40)తోపాటు మరో ముగ్గురు కలిసి మినుము పంట నూర్పిడి చేసేందుకు కూలీపనులకు వెళ్లారు. పొలంలో మినుము నూర్పిడి చేసి మరో చేలోకి యంత్రాన్ని ట్రాక్టర్‌కు తగిలించుకుని తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తూ పంట కోత యంత్రం బోల్తా పడింది. సుబ్బమ్మపై యంత్రం పడటంతో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మరో ముగ్గురు గాయపడ్డారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

ప్రయాణికుల అవస్థలు

- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



ప్రయాణికులతో కిక్కిరిసిన నందికొట్కూరు ఆర్టీసీ బస్టాండ్

నందికొట్కూరు: నందికొట్కూర్ నుంచి కర్నూలుకు వెళ్లే ప్రయాణికులు బస్సు సర్వీసులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయినా ఆర్టీసీ అధికారులు స్పందించడం లేదు. సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు ఒక్క బస్సు సర్వీసు కూడా లేకపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందల సంఖ్యలో ఉద్యోగులు నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాలకు కర్నూలు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వారు ప్రతిరోజు సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్‌లో దాదాపు రెండు గంటల పాటు నిరీక్షించాల్సి వస్తోంది. విద్యార్థులు కూడా బస్సు సర్వీసులు లేకపోవడంతో ఒక్కో సారి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సాయంత్రం 4. 30 గంటల నుంచి బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుత్ వైర్ల దొంగలు అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ హనుమంత్ నాయక్, ఎస్‌ఐ రమణయ్య

సంజామల: వ్యవసాయ విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న దొంగలను ఎట్టకేలకు శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ హనుమంతు నాయక్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని ఆకుమల్ల, కమలపురి, నట్లకొత్తూరు గ్రామాల్లో రైతుల విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేటకు చెందిన శివచంద్రుడు, బేతంచర్ల చెందిన ఇరగలి మురళి, పాణ్యం పాండురంగడు కలిసి రైతుల విద్యుత్ వైర్లను చోరీ చేసినట్లు ఆధారలు సేకరించి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. ఆకుమల్ల, కమలపురి, నట్లకొత్తూరు, కోవెలకుంట్ల గ్రామాల్లో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి వద్ద నుంచి రూ.3 లక్షల విలువ చేసే వైర్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ రమణయ్య, సిబ్బంది చెన్నయ్య, సురేస్, సురేంద్ర పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జనార్దన్ రావు



సామాజిక తనిఖీ బహిరంగ విచారణలో మాట్లాడుతున్న పీడీ జనార్దన్ రావు

వెలుగోడు: ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జనార్దన్ రావు సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐదు రోజులుగా సామాజిక తనిఖీ సిబ్బంది 8 గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో ఆడిటింగ్ చేసి ఖర్చులు రికార్డులకు రాని నిధులను తెలియజేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రికార్డుల్లోకి రాని ఖర్చులు అబ్దుల్లాపురం రూ.9,851, బోయరేవుల రూ.1,484, మాధవరం రూ.4,638, మోత్కూరు రూ.7,872, వేల్పనూరు రూ.1,455, రేగడ గూడూరు రూ.930, వెలుగోడు రూ.39 వేలు రికవరీకి ఆదేశించామన్నారు. కొన్ని పనులను ఎం బుక్‌లో చేర్చలేదని, కొన్ని పనులకు నో డిమాండ్ తీసుకోలేదని, కొన్ని పనులకు సంతకాలు లేకుండా పేమెంట్ చేశారని ఆరోపణలు వచ్చాయి. పనుల వద్ద నీడ, ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరారు. పట్టణంలోని ఆరు పనులకు ఉపాధి పనులు చేశామని ఉపాధి సిబ్బంది, పనులు చేయలేదని సామాజిక అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పీడీ ఆ పనులపై త్రిసభ్య కమిటీ వేసి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, డీవీఓ బాలాజీ నాయక్, ఏపీడీ అన్వర్ బేగం, ఉపాధి హామీ ఏపీఓ మల్లికార్జున, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయం సిబ్బంది, మేటీలు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని 96 వాహనాలు సీజ్



నంబర్ ప్లేట్లు చూపుతున్న వాహనదారులు

కర్నూలు: నంబరు ప్లేట్ లేని 96 ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఆర్‌ఎస్‌ఐ హుసేన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు బృందాలుగా ఏర్పడి నగరంలోని సీ.క్యాంపు, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ప్రాంతంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబరు ప్లేట్ లేకుండా తిప్పుతున్న 96 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం ఒక్కో వాహనానికి రూ.535 చొప్పున 45 వాహనాలకు రూ.24,075 జరిమానా విధించి వసూలు చేశారు. మిగతా 51 ద్విచక్ర వాహనదారులు తమ వాహనాల నంబరు ప్లేట్లు తీసుకువచ్చి చూపించగా కౌన్సిలింగ్ ఇచ్చి వాహనాలకు కనిపించే విధంగా ఏర్పాటు చేసి వదిలేశారు. ఇకపై నిరంతరం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘణలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని సీఐ తెలిపారు.

సారా బట్టీలు ధ్వంసం



నాటుసారాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు: బంగారుపేటలోని కేసీ కెనాల్ గట్టుపై ఉన్న సారా బట్టీలను ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్, కృష్ణ తదితరులు వారి సిబ్బందితో బృందాలుగా ఏర్పడి శుక్రవారం ఉదయం బంగారుపేటలో ఉన్న నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. కేసీ కెనాల్ గట్టు వెంట పర్యటించి బట్టీలన్నీ ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించిన కుండలు, సామగ్రితోపాటు నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న 2,400 లీటర్ల బెల్లం ఊట, 35 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. బంగారుపేటలో సారా విక్రయిస్తున్న గోనెల నాగదుర్గ వద్ద 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రహాస్ తెలిపారు. సోదాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి

- బీజేపీ కార్యకర్తలపై కేసు నమోదు

ఆదోని అర్బన్: మండలంలోని కపటి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్డే కృష్ణపై బీజేపీ కార్యకర్తలు శుక్రవారం దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలో తనపై బీజేపీ కార్యకర్తలు బోయ ఉషారాజు, బోయ నరసింహులు, బోయ రాజబాబు, బోయ రాంబాబు దాడి చేశారని వడ్డే కృష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు.

నీటిలో మునిగి యువకుడి గల్లంతు



మునిస్వామి(ఫైల్)

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట సమీపంలో గాలేరు నగరి కాల్వపై డ్రాప్ కం రెగ్యులేటర్ వద్ద ఓ యువకుడు మునిగి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆస్పరి మండలం తంగరడోణ గ్రామానికి చెందిన నాగేంద్రప్ప, ఉసేనమ్మ దంపతుల కుమారుడు మునిస్వామి (25)తోపాటు మరో ఆరుగురు బతుకుదెరువు కోసం పాణ్యం మండలం పిన్నాపురం గ్రామ పరిధిలోని సోలార్ పరిశ్రమలో సెంట్రింగ్ పనులు చేసేందుకు వచ్చారు. శుక్రవారం పని లేకపోవడంతో సుగాలిమెట్ట వద్ద గాలేరు కాల్వపై డ్రాప్ కం రెగ్యులేటర్ చేపలు పట్టుకునేందుకు వల వేసేందుకు నీటిలో దిగారు. వలను వేసేందుకు మరింత ముందుకు వెళ్లారు. గేట్ల వద్ద లోతు ఎక్కువగా ఉండడం, నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో నీటిలో మునిగి గల్లంతయ్యాడు. తోటి కూలీలు చెంచుల సాయంతో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

తగ్గిన అల్లం ధరలు

- కిలో రూ.50 నుంచి రూ.60



అల్లం విక్రయిస్తున్న దృశ్యం

గోస్పాడు: అల్లం ధరలు అమాంతంగా తగ్గాయి. నెల రోజుల క్రితం మార్కెట్లో రూ.150 నుంచి రూ.170 పలికిన అల్లం ధర ప్రస్తుతం రూ.50 నుంచి రూ.60 వరకు పడిపోయింది. అస్సాం నుంచి దిగుమతి అయ్యే అల్లాన్ని హోల్‌సేల్ వ్యాపారుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్న చిన్నచిన్న వ్యాపారులు.. మార్కెట్లో విక్రయాలు సాగిస్తున్నారు. అల్లం వినియోగదారులు గతంలో చిల్లర ధరలకు విక్రయించాలంటే ఒకింత అవస్థలు పడేవారు. వ్యాపారుల వద్ద రూ.10 కొనుగోలు చేయాలన్నా అల్లం విక్రయించేందుకు సుముఖంగా వ్యాపారులు లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం అల్లం ధర తగ్గడంతో గతంలో రూ.10 కొనుగోలు చేసే వినియోగదారులు ఇప్పుడు పావుకిలో వరకు కొనుగోలు చేసి నిల్వ ఉంచుకుంటున్నారు.



కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశనగ	2,332	6,789
పొద్దుతిరుగుడు	2,669	2,669
ఆముదం	3,691	5,609
వాము	12,069	12,069
ఉల్లి	609	4,321
ఎండుమిర్చి	1,111	15,500
శనగలు	6,329	6,329
కందులు	2,600	9,591
మొక్కజొన్న	2,289	2,289
మినుములు	7,509	7,509
కొర్రలు	2,429	2,429
సోయాచిక్కుడు	3,809	3,809
సజ్జలు	2,191	2,304

ఫోన్ నం : 08518-257204, 257661